

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

– పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**శ్రీనివాసం దేశాదిమ్మరిలా** తయారయ్యాడు. ఏ వర్క్ షాపులో నయినా ఓ రోజు కూలిపని చేస్తాడు బుద్ధి పుడితే. లేకపోతే లేదు. స్టూడియోల దగ్గర వాచ్ మెన్ ఉద్యోగమైనా చేస్తానంటూ తిరిగాడు. అదీ దొరకలేదు గానీ, ఓ సినిమా హాల్లో గేటుకీపరుగా దొరికింది ఉద్యోగం.

అస్తమానూ సీతను డబ్బుల కోసం వేధించుకు తింటుంటే సీత తరిమి కొట్టింది. రామచంద్రాన్ని, ఊర్మిళనూ పీడించటం మొదలు పెట్టాడు. ఎప్పుడో రూపాయో, రెండు రూపాయలో తీసుకు వెళతాడు యిస్తే. మళ్ళీ వారం రోజులకు కనిపిస్తాడు. అనసూయమ్మకు ఇప్పుడు శ్రీనివాసాన్ని గురించిన దిగులుతో నిజంగానే గుండె నొప్పి వస్తోంది.

దానికి తోడు సీత ప్రవర్తన చాలా మారిపోయింది..

నరసింహంతో చీటికీ మాటికీ పోట్లాట వేసుకుని, ఊర్మిళ ఇంటికి వెళ్లి పది రోజులు అలక సాగించి, తర్వాత నరసింహం వెళ్లి బ్రతిమాలి పిల్చుకు వస్తే, ఇంటికి వస్తుండేది ఇంతక్రితం. రానురాను నరసింహాన్ని మరింత చులకన

చెయ్యటమే గాక, "నువ్వు నా భర్తగా తగవు" అంటూ రభస చేస్తోంది. అభం శుభం ఎరగని నరసింహానికి పరస్త్రీలతో సంబంధం ఉందనీ, తనని చిత్రహింస పెడ్తున్నాడని అల్లరి చేస్తోంది.

ఇరుగు పొరుగులు సీత ప్రవర్తనని అసహ్యించుకోవటమే గాక, అనసూయమ్మని మొదట్లో చాటుమాటుగానూ, తర్వాత బాహాటంగానూ విమర్శించటం సాగించారు.

"ఆ తల్లి కూతురు కాదూ ఈవిడ? పెద్దావిడ ఇచ్చిన అలుసు గాకేమిటిదంతా? భర్త మీద వుండ వలసిన కనీస గౌరవ మర్యాదలైనా వుండాలని ఏ నాడేనా కూతుర్ని మందలించిందా?" ఇలా...

అనసూయమ్మకిది చచ్చే చావుగా వుంది. కలెక్టారో, డాక్టరో, యాక్టరో అవుతాడని ఆశలు పెంచుకున్న శ్రీనివాసం ఎందుకూ కొరగానివాడిగానూ, కొరకరాని కొయ్యగానూ తయారయ్యాడు. సీత అల్లుడి పట్ల ప్రదర్శించే అతిశయాన్ని... "అల్లుడ్ని లొంగదీసుకునే" అంశంగా సమర్థించిందే గానీ, బొత్తిగా ఇలా బరి తెగించి పోవటాన్ని సమర్థించ లేకుండా వుంది.

హఠాత్తుగా సీత నాలుగు నెలలు ఏకంగా ఊర్మిళ ఇంట్లో మకాం పెట్టేసింది. మాలతి ప్రోత్సాహమూ వుంది పరోక్షంగా. కానీ సీత నరసింహానికి విడాకులకు నోటీసు ఇప్పించిందని తెలిసిన క్షణంలో కుప్పకూల బడిపోయింది అనసూయమ్మ.

అందాకా పెదవి విప్పని నరసింహం ఆ రోజు నిజంగానే 'నరసింహం' అయిపోయాడు.

"ఇక నువ్వూ నీ కూతురి దగ్గరే పడి వుండవమ్మా తల్లీ! ఇందాకా, నీ కూతురి ఆగడాలన్నీ భరించటమే నేను చేసిన మొదటి తప్పు. అలాగే భార్య మీది మితి మించిన ఆరాధనతో, ఆమె తల్లిగా నిన్ను నెత్తి మీద పెట్టుక పూజించటం రెండో తప్పు. నాలో వున్న ఒకే ఒక బలహీనత సీత అందం పట్ల వెర్రివాణ్ణి కావటమే. నేను తనకు తగినంత అందగాణ్ణి కాదేమోనన్న గిల్టీనెస్ మాత్రమే. దానికి శిక్షగా మిమ్మల్నందర్నీ భరించాను. నేను తిరుగుబోతు అంటూ సీత అల్లరి పెదుతుంటే సహించాను. ఈ రోజు నేను తనని చిత్రహింసలు పెడుతున్న కారణంగా విడాకులు కోరుతున్నానంటూ లాయర్ నోటీసిచ్చింది.

ఇంత గొడవ లేకుండా, "నువ్వంటే నాకిష్టం లేదు. నేను నీ నుంచి విడి పోదల్చుకున్నాను" అంటే ఏ గొడవా లేకుండానే విడిపోయి వుండే వాళ్ళం కదా! నా నుంచి భరణం గుంజేందుకు మాత్రమే ఈ నాటకం. అవునా? ఇక వెళ్ళు.ఇక నువ్వుగానీ, నీ కూతురు గానీ ఈ ఇంటికి రానవసరం లేదు" అన్నాడు.

అనసూయమ్మకు దిక్కు తోచలేదు. భర్త మరణించిన తర్వాత నెల్లూరులో తమకున్న ఇల్లు అమ్మేశారు. తను, సీత, శ్రీనివాసం కలిసి వచ్చిన డబ్బు ముప్పై వేలూ శ్రీనివాసు కొంత తగలేస్తే, సీత కొంత తగలేసింది. తనకంటూ ఐదువేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ లో వుంది. తన తదనంతరం అది శ్రీనివాసానికి చెందాలని...

ఇప్పుడిక తనెక్కడ ఉండాలి? ఇల్లా వాకిలా? ఇల్లు పట్టకుండా తిరుగుతున్న శ్రీనివాసం దగ్గరా? ఊర్మిళ ఇంట్లో మకాం పెట్టేసిన సీత దగ్గరా? ఏది దారి?

ఈ మధ్య ఊర్మిళకు తరచూ తను హిందీ పరీక్షలకు చదువుతుండిన రోజుల్లో బాగా ప్రభావితురాలైన మైధిలిశరణ గుప్త 'ఊర్మిళ' పాత్ర పదే పదే గుర్తుకు వస్తోంది. ఏదో వ్రాయాలని తపన. తనని ఊర్మిళ పాత్రలో ఊహించు కుంటూ.

మనిషి పూర్తిగా కష్టాలలో వున్నప్పుడు, నిస్పృహకు లోనైపుడు, లేక ఏదైనా హృదయం కదిలించే సన్నివేశం చూచినపుడు ప్రభావితుడై ఆ స్పందనలో నుంచే ఒకానొక భావావేశం కవితావేశం వస్తుందా?

కళ భగవద్దర్శనానికి ఓ దారి కావొచ్చు.

అప్పుడప్పుడూ చిత్తుగా కొన్ని కాగితాలు వ్రాసింది కూడానూ. కానీ అవి క్రమ పద్ధతిలో కుదరటం లేదు. పెదనాన్న ఓసారి ఊర్మిళ గురించి, మరోసారి అహల్య గురించీ చాలా ఆవేశంగా చెప్పారు. ఆ పాత్రలనే మరో రకంగా మలవాలనే ఆలోచన కలిగిందప్పుడు. ఇప్పుడు ఏదో వ్రాయాలని అనిపిస్తోంది.

ఆ మాటే అంది ఓ రోజు రామచంద్రంతో, "తప్పకుండా వ్రాయి ఊర్మిళా! ప్రతి కళాకారుడి జీవితంలోనూ అంతర్గతంగా ఏదో ఓ విషాదం వుంటుంది, లోతుగా వ్యక్తిగత జీవితం పరిశీలిస్తే. లేదూ అలా తన వ్యక్తిగత జీవితంలో విషాదం ఏమీ లేకుండానే అద్భుత కళను సాధించగలిగిన వ్యక్తికి ఇతరుల జీవితాల్లోని విషాదాలు ఇన్స్పిరేషన్ అవుతాయి. మొత్తం మీద హృదయ స్పందన కలిగినపుడే కళ వెన్ను తట్టినట్లు మేల్కొల్ప బడుతుంది" అన్నాడు.

నాలుగైదు చిత్తు కాగితాలు తెచ్చి చూపింది ఊర్మిళ  పాత్రకు సంబంధించి తను వ్రాసినవి.

చదివి అన్నాడు. "బాగా కృషి చెయ్యి. ఊహలున్నాయి. కానీ అవి క్రమపద్ధతిలో సాగటంలేదు. కాగితం మీద ప్రయత్నిస్తే సాధించగలవు. ఏ చేయి తిరిగిన రచయితో, రచయిత్రో ఈ కాగితాలు చూస్తే, కథంతా అల్లుకు పోగలదు. నీలోని ఊహ, నీవు వ్రాయదలచుకున్న ధ్యేయం కనిపెట్టి పూర్తి చేయగలదు. నీవు వ్రాయలేకపోతే, ఎవరికేనా చెబుదాం. ఈ కాగితాలు చూపుదాం. ఈ లోగా నీవు ప్రయత్నించు" అన్నాడు.

ఆరోమారు అబార్షన్ అయింది ఆ రాత్రే ఊర్మిళకు. లలిత దగ్గర చేర్పించారు.

లలితకీ, ఊర్మిళకీ బాగా ఆత్మీయత ఏర్పడింది. నువ్వు అనుకోవటమే గాక, 'అదికాదే, ఇది కాదే' అంటూ చిన్ననాటి స్నేహితురాళ్ళలా కబుర్లు చెప్పుకోనేంతటి గాఢ మైత్రి పెంపొందింది.

లలితా కూడా ఓ రోజు అంది.

"నువ్వేదో కథలు రాయటం మొదలెట్టావుట ఊర్మిళా! రామచంద్రం చెప్పాడు. ఏవీ ఆ కాగితాలు? నేనూ చూస్తాను" అంది.

"నా మొహం. ఏమిటో వ్రాశాను. కొంత కొంత పూర్తి చేయగలననే నమ్మకం నాకే లేదు" అంది ఊర్మిళ నవ్వుతూ.

"అసలు నీ భావావేశం ఎలా వుందో చూద్దామని."

"అలాగే ఇస్తాలే" అంది.

ఆ రాత్రే ఆమెకు మరోమారు అబార్షను అయి లలితా నర్సింగ్ హోంలో చేర్పించ బడింది. అయితే ఇక ఈసారి ఆమెకు గర్భకోశం బాగా దెబ్బతిన్నది. ఇక ముందు అబార్షన్స్ అయినా, కాన్పులయినా తట్టుకొనే స్థితి లేదు. గర్భకోశం తీసివేస్తే తప్ప ఆమెకు స్వస్థత చేకూరదు. ఇక ఈ జన్మకు సంతానం కలిగే ఆశ కూడా లేదు.

లలిత లోలోపల రామానుజాన్ని తిట్టుకుంది.

"వాడు వట్టి బ్రూట్ రాజూ! వాడికి ఉన్నన్ని రోగాలు మరెవరికీ ఉండవేమో! ఊర్మిళ శరీరం సగం శిథిలమై పోయిందా జబ్బులతో. ఆమెకి పిల్లలు కలిగినా ఏ అవిటివారు కలుగుతారోనని భయంగా వుండేది నాకిందాకా. ఇప్పుడిక ఆమెకు పిల్లలు కలగరు. గర్భాకోశం రిమూవ్ చేసి తీరాలి" అంది ఆవేదనగా భర్త రాజుతో.

"వాటె పిటి లలితా! మన దేశంలో ఇలా మగ్గిపోతున్న స్త్రీలు ఎందరున్నారో గదా! మీ ఊర్మిళలాటి స్త్రీలకి ఆ భర్త నుంచి విడాకులు తీసుకునే ధైర్యమూ, చొరవా వుండవు ఖర్మ" అన్నాడు రాజు బాధగా.

రామచంద్రం మామగారు హఠాత్తుగా జబ్బు పడ్డారు. ఇక తాను ప్రాక్టీసు చూచుకోలేననీ, విజయవాడలోని తన నర్సింగ్ హోం బాధ్యతంతా రామచంద్రన్నే చూచుకోవాలనీ కోరుతూ వ్రాసి పంపారు.

రామచంద్రం, సుమతి విజయవాడకి తమ మకాం మార్చే సన్నాహాలు ప్రారంభించారు.

“నేను ఇక్కణ్ణించి వెళ్లి పోతున్నాను లలితా! ఊర్మిళకిక నువ్వే ధైర్యం కలిగించాలి. మా సీత మూడు నెలలుగా ఊర్మిళ ఇంటికే వచ్చి వుంది. నాకేమిటో ఛాలా భయం కలిగిస్తోందా ఇంటి వాతావరణం” అన్నాడు రామచంద్రం.

“అలాగే” అంది లలిత ఏం చెప్పాలో తోచక.

“ఓ రహస్యం చెప్పనా? మళ్ళీ ఊర్మిళతో అనకు” అన్నాడు రామచంద్రం మరోరోజు.

“అనునులే చెప్పు.”

“నిన్న మా సీత వదినెను వంటరిగా కలుసుకున్నాను. ఆమెను ఇంత క్రితంలా వదిన అనటం లేదు నేను. ఆమె ప్రవర్తన మారిపోయాక, నేను సీతా అనే పిలుస్తున్నాను జబర్దస్తీగా. నాకంటే వయసులో పెద్దదన్న గౌరవభావం తుడిచి పెట్టుకు పోయింది.”

“అసలు సంగతి చెప్పు రామచంద్రం.” ఆదుర్దాగా అడిగింది లలిత.

“ఇలా నువ్వు చీటికీ మాటికీ ఊర్మిళ ఇంటికొచ్చి వుండటం ఏమీ బాగాలేదు సీతా! లోకం ఏమనుకుంటుందో ఆలోచించు” అన్నాను మందలింపుగా.

సీత నవ్వింది. పిశాచపు నవ్వులా వుందా నవ్వు.

“ఏమనుకుంటుంది రామచంద్రం? రామనుజానికీ నాకు ఏదో సంబంధం వుందనుకుంటుంది అంతేనా!”

“అంతేనా? అది నీకు అవమానం కాదా?” అన్నాను కోపంగా.

“ఎందుకూ? రామనుజానికీ నాకూ చాలా రోజులుగా సంబంధం వుంది. మాలతి మామధ్య సాన్నిహిత్యానికి చాలా దోహదం చేసింది. చేస్తోంది కూడాను. ఈ విడాకుల గొడవ కోర్టు వరకూ వెళ్ళకుండానే పరిష్కారం చేస్తాడు నరసింహం. ఆతర్వాత రామానుజం భార్యగానే వుండి పోతాను. దర్జాగా.”

నిర్ఘాంతపోయాను నేను. ఇది సీతా? దెయ్యమా? ఎంత పవిత్రమైన పేరుకు ఎంతటి మకిలి ఆపాదించింది ఈ పిశాచం! ఎంత సిగ్గుమాలినతనం వెదజల్లుతోంది.

“ఛ… ఊర్మిళ బ్రతుకేమై పోవాలి? సిగ్గు లేదూ నీకిలా చేయటానికీ, మాట్లాడటానికీనూ?” జుగుప్సతో నాకు శరీరం జలదరించి మాటలు పెగలటం లేదు.

"సిగ్గెందుకోయ్ రామచంద్ర మూర్తీ! నా పేరు సీతే! కానీ నా ఆలోచనలు శూర్పణఖ లాటివన్నా నేనేమీ బాధపడను. ఆ రోజు నీకు గుర్తుందా రామచంద్రం?" సీత కళ్ళు పిశాచపు కళ్ళలా ఎర్రగా జ్వలించాయి క్షణకాలం.

"నా పెళ్లిచూపులు జరిగాయి. వారం తర్వాత ఈ రామానుజం వాళ్ళ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. తమకి ఊర్మిళ నచ్చిందని, గుర్తుందా?" గద్దించినట్లు అంది సీత.

'గుర్తుందే పిశాచమా, గుర్తుందే' అనుకున్నాను లోలోపల. పైకి మాత్రం "ఊఁ!" అన్నాను.

"ఆ రోజు ఊర్మిళ గర్వపడిందో లేదో నాకు తెలీదు."

ఆమె మాటలకు అడ్డు వస్తూ అరిచాను. "గర్వపడలేదు. అలా జరిగినందుకు ఎంతో బాధ పడింది. నాతో ఎన్నో మార్లు అంది.

"రామచంద్రం! ఇలా అయిందేమిటి? సీతక్క బాధ పడ్తుంది. అసలీ సంబంధం నాకు వద్దని చెప్పాను పెదనాన్నకు" అంటూ శేషాచారి మామయ్యతో కూడా చెప్పింది. తనకు ఆ సంబంధం వద్దనీ, సీతక్క నొచ్చుకుంటుంది అనీను. మామయ్యే "నీకు తెలీదు లేమ్మా. నే చూచుకుంటాను అన్నారు" అన్నాను.

"ఏమో? నాలో మాత్రం పగ ప్రతీకారం రగిలి పోయాయి. నా అందానికి మూర్ఛపోయి, తాము చూస్తున్న పెళ్లికూతుళ్ళని వదిలి నాకేసి ఆత్రంగా చూచిన అబ్బాయిలను విజయగర్వంతో చూశాను మా అమ్మ వెంట వెళ్లి. ఆ అబ్బాయిలు తాము చూచిన అమ్మాయిలని గాక, నన్ను కట్నం కోరకుండా పెళ్లాడతామంటూ కబురు పంపిస్తే నేనూ అమ్మా గర్వపడేవాళ్ళం. అలా ఎందరి పెళ్లిచూపులకో వెళ్లి, నా అందాన్ని ఒరుపు వేసి చూచుకోవటం నాకు హాబీగా వుండేది. అమ్మకూ అదో సరదాగా గొప్పగా వుండేది. తీరా నా పెళ్లి'చూపుల నాడు జరిగిందేమిటి?

భువన మోహనంగా వున్నా నేను...

నా చెలికత్తెలా వుండిన ఊర్మిళ!

గెలుపు నాదేనన్న ధీమాతో ఈ పెళ్ళికొడుకు నన్ను చూచి మూర్ఛపోతాడన్న భ్రమలో వుండిపోయిన నాకు... మాడు పగిలిపోయేంత దెబ్బ వేస్తూ వచ్చిందా వుత్తరం, 'ఊర్మిళ నచ్చింది' అంటూ.

ఊర్మిళ ఎలా నచ్చింది? ఎందుకు నచ్చింది? నాలో లేని ఏ సౌందర్యం ఊర్మిళలో చూశాడతగాడు?

ఊర్మిళంటే తగని పగ రగిలింది. ఏ హొయలు చిలికించిందో? ఏ అమాయకత నటించిందో? అమ్మకూ అవే సందేహాలు. నాకు సమాధానం కొంత దొరికింది.

ఊర్మిళ తల్లితండ్రి చనిపోయారు. కానీ ఆమె పిత్రార్జితం చాలా వుంది. అదొక్కటే ఆమెలో సౌందర్య దీపాలు వెలిగించింది ఆ పెళ్ళికొడుకు దృష్టిలో

కానియ్! ఎందాకా వెడతాడో ఈ పెళ్ళికొడుకు? నా నుంచి గెలిచాననుకుంటున్న ఊర్మిళ... నా అహం మీద దెబ్బ వేయగలిగిన ఊర్మిళ... నానుంచి ఎలా తప్పుకుంటుందో చూస్తాను.

నరసింహం నాకస్సలు నచ్చలేదు నిజానికి. నల్లగా, నాకంటే కొద్దిపాటి ఎత్తులో... పీలగా వున్న నరసింహం,,, పక్కన తెల్లగా, ఒడ్డూ పొడవుతో పాలరాతి శిల్పంలా వుండే నేను.

ఛ... ఒద్దు ఒద్దు అనిపించింది. కానీ నరసింహం కళ్ళలో ఆ కాస్సేపటిలో నా పట్ల ఒలికిన ఆరాధన, నా అందంతో చిత్తయి పోయిన అతగాడి మనోనిబ్బరం గమనించాక నా ఆశయ సిద్ధికి ఇతగాడే తగిన వ్యక్తి అనిపించింది.

“నాకు ఆ అమ్మాయి తప్ప మరో భార్య వద్దు జీవితంలో. కానీ ఆమె నా నలుపునీ నన్నూ ఇష్టపడుతుందో లేదో. ఆమె ఇష్టపడక పోతే బ్రహ్మచారిగానే వుండిపోతాను గానీ మరెవర్నీ పెళ్ళాడను. అంతటి సౌందర్యరాశిని నా భార్యగా పొందగలిగే వరం కంటే నేనేదీ కోరను” అని చెప్పాడుట నరసింహం మధ్యవర్తితో. అవే మాటలు యధాతథంగా చెప్పాడాయన మాతో.

“నీ ఇష్టం చెప్పమ్మా. నీకిష్టం లేకుంటే వద్దు. కుర్రాడు కాస్త అనాకారిగానే వున్నాడు” అంది అమ్మ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments